
సాక్షి
ఖమ్మం
ఆదివారం । 15 । డిసెంబర్ । 2024



విద్య, వైద్యానికే ప్రాధాన్యత

సత్తుపల్లిలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా మహాసభలు ప్రారంభంకాగా ముఖ్యఅతిథిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. 8లో



మామిడి.. కష్టమేనా దిగుబడి?

ఈ ఏడాది మామిడి పూత అంతంతగానే ఉండడం.. పూత వచ్చినా నిలవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
29°/ 12°

వాతావరణం

జిల్లాలో ఆదివారం కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది. సాయంత్రం తర్వాత చలి మరింతగా పెరుగుతుంది.

న్యూస్‌రీల్

శ్రీవారికి అభిషేకం, నిత్యకల్యాణం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌తో పాటు ఆలయ ఆవరణలోని శ్రీవారి పాదానికి పంచామృతంతో అభిషేకం జరిపించారు. ఆతర్వాత స్వామి, అమ్మ వార్లను పట్టు వస్త్రాలతో అలంకరించి నిత్య కల్యాణం నిర్వహించారు. తెలంగాణ, ఏపీ నుంచి పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు స్వామి కల్యాణాన్ని తిలకించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పౌర్ణమి సందర్భంగా స్వామి, అమ్మ వార్లను పల్లకీ సేవగా గిరి ప్రదక్షణ చేయించగా గోవింద నామస్మరణ మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈఓ కె.జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు ఈనెల 16 నుంచి 21వ తేదీ నిర్వహించనున్నట్లు డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈనెల 16న పురుషుల కబడ్డీ, పురుషులు, మహిళల స్విమ్మింగ్, పురుషుల రెజ్లింగ్, బాలబాలికల టేబుల్ టెన్నిస్, కరాటే, పురుషుల బాస్కెట్‌బాల్, వాలీబాల్ పోటీలు జరుగుతాయని వెల్లడించారు. అలాగే, 17న మహిళల కబడ్డీ, బాలబాలికల బ్యాడ్మింటన్, ఉషూ, అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, 18న లాన్‌టెన్నిస్, రోయింగ్, షూటింగ్, బాలబాలికల చెస్, ఆర్చరీ, మహిళల వాలీబాల్, హ్యాండ్‌బాల్, 19న పురుషులకు తైక్వాండో, మహిళల నెట్‌బాల్, ఫుట్‌బాల్, పురుషులకు ఖో–ఖో, 20న పురుషుల హ్యాండ్‌బాల్, సైక్లింగ్, పవర్ లిఫ్టింగ్, జూడో, 21న మహిళలకు ఖో–ఖో, పురుషులు, మహిళలకు బాక్సింగ్, యోగా, వెయిట్‌లిఫ్టింగ్, మహిళలకు బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. పోటీల పర్యవేక్షణకు క్రీడాంశాల వారీగా ఇన్‌చార్జిలను నియమించినట్లు డీవైఎస్ఓ వెల్లడించారు.

పశుగణన పకడ్బందీగా నిర్వహించాలి



ఎన్యుమరేటర్లతో మాట్లాడుతున్న డైరెక్టర్ గోపి

వైరా: పశుగణనను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా కచ్చితమైన లెక్కలు తేల్చాలని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి సూచించారు. వైరా మండలం స్టేజీ పినపాకలో పశుగణనను శనివారం ఆయన జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి కే.వీ.నారాయణతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా గోపి మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్యుమరేటర్లు పశు గణన చేస్తూ ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలని తెలిపారు. అలాగే, ప్రతీ ఇంట్లో పశువులను పెంచి పాడి పరిశ్రమ అభివృద్ధి చెందేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.కిషోర్, ఎం.రాకేష్, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ జి.సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోండి



తరగతులను పరిశీలిస్తున్న కోఆర్డినేటర్ అనురాధ

కారేపల్లి: వయస్సు, విద్యార్హతలతో సంబంధం లేకుండా పదో తరగతి, ఆతర్వాత ఇంటర్ చదివే అవకాశమున్న ఓపెన్ స్కూల్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్టేట్ కోఆర్డినేటర్ అనురాధ సూచించారు. కారేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఓపెన్ స్కూల్ సెంటర్‌ను శనివారం పరిశీలించిన ఆమె తరగతులకు హాజరైన వారితో మాట్లాడారు. ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు ఈనెల 16వ తేదీ వరకు అవకాశముందని, ప్రతీ ఆదివారంతో పాటు రెండో శనివారాల్లో తరగతులు ఉంటాయని తెలిపారు. ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు, మండల కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఉద్యోగులు నసీరుద్దీన్, ముండ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో మార్పులు



మహ్మదాపురం ఆశ్రమ పాఠశాలలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

పేదింటి పిల్లలు కూడా గొప్పగా ఎదగాలి

- అందుకే గురుకులాల్లో 'కామన్ డైట్' అమలు
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి

తిరుమలాయపాలెం: రాష్ట్రంలోని పేదింటి పిల్లలకు కూడా ఉన్నత విద్యావకాశాలు అందేలా తమ ప్రభుత్వం విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తోందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఈక్రమంలోనే ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా మౌలిక వసతులు కల్పించగా.. ఇప్పుడు గురుకులాలు, హాస్టళ్లలో పౌష్టికాహారం అందేలా కామన్ డైట్ అమలుకు నిర్ణయించామని తెలిపారు. తిరుమలాయపాలెం మండలంలోని మహ్మదాపురం గిరిజన గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో కామన్ డైట్ మెనూ అమలును శనివారం మంత్రి ప్రారంభించి మాట్లాడారు. పేదల పిల్లలు కూడా ధనికుల పిల్లల్లా ఎదిగేలా డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచామని తెలిపారు. ఈ కారణంగా ప్రభుత్వంపై అదనంగా రూ.500 కోట్ల భారం పడుతున్నా బాధ్యతగా చేశామని వెల్లడించారు. గత ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు, ఉపాధ్యాయుల నియామకం చేపట్టడమే కాక ప్రతీ నియోజకవర్గంలో రూ.కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని మంత్రి తెలిపారు.

ఈనేపథ్యాన ఉపాధ్యాయులు విద్యార్థులను సొంత పిల్లల్లా చూసుకుంటూ తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దశల వారీగా మూడు నెలల్లో హాస్టళ్లు, గురుకులాల్లో సిబ్బందికి వంటల తయారీ, సరుకుల నిల్వలో జాగ్రత్తలపై శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి, అధికారులు పాఠశాలలో వంటలు, స్టోర్ రూమ్‌లో సామగ్రిని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం నిర్మాణంలో ఉన్న పాఠశాల భవన పనులను పరిశీలించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, సీఈ శంకర్, డిప్యూటీ డైరెక్టర్ విజయలక్ష్మి, ఈఈ తానాజీ, తహసీల్దార్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క

బోనకల్: ప్రజాప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు. బోనకల్ మండలంలోని వివిధ గ్రామాల్లో రూ.21.41కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ముష్టికుంట్ల, బోనకల్, రావినూతల, జానకీపురంలో సీసీ రోడ్లకే కాక వివిధ ప్రాంతాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి భట్టి శంకుస్థాపన చేశారు. అలాగే, రాపల్లిలో రూ.20లక్షలతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనం పనులకు భూమి పూజ చేశారు. అంతేకాక బోనకల్ తహసీల్ పక్కన ఏర్పాటు చేసిన స్త్రీ టీ పాయింట్‌ను ప్రారంభించిన భట్టి, బోనకల్ చర్చిలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూనే మధిర నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. ఈకార్యక్రమాల్లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ట, ఆర్డీఓ నర్సింహారావు, తహసీల్దార్ పున్నంచందర్, ఎంపీడీఓ రమాదేవి, ఎంఈఓ పుల్లయ్య, ఐకేపీ ఏపీఎం పద్మలత, కాంగ్రెస్ నాయకులు పైడిపల్లి కిశోర్, బందం నాగేశ్వరరావు, గాలి దుర్గారావు, కర్నాటి కోటి, చేబ్రోలు వెంకటేశ్వర్లు, పిల్లలమర్రి నాగేశ్వరావు, షాజహాన్, ముస్తఫా పాల్గొన్నారు.

గ్రూప్–2కు అంతా సిద్ధం

- ఉమ్మడి జిల్లాలో 123 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 41,566 మంది అభ్యర్థులు
- అర గంట ముందు వరకే కేంద్రాల్లోకి అనుమతి



ఖమ్మంసహకారనగర్: ఉమ్మడి జిల్లాలో గ్రూప్–2 పరీక్షలు ఆది, సోమవారాల్లో జరగనున్నాయి. రెండు రోజుల పాటు రెండేసి సెషన్లలో పరీక్షలు జరగనుండగా అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై ఇప్పటికే ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు ముజమ్మిల్‌ఖాన్, జితేష్ వి.పాటిల్ పలుమార్లు అధికారులతో సమీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. నిర్ణీత సమయానికి అరగంట ముందు వరకే అభ్యర్థులకు కేంద్రాల్లోకి అనుమతి ఉంటుందని.. ఆతర్వాత గేట్లు మూసివేస్తామనే అంశంపై విస్తృతంగా ప్రచారం చేశారు.

ఖమ్మంలో 85, భద్రాద్రిలో 38 సెంటర్లు

గ్రూప్–2 పరీక్ష నిర్వహణకు ఖమ్మం జిల్లాలో 85 కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఈ జిల్లాలో 28,101 మంది అభ్యర్థులకు పరీక్షలకు హాజరుకానున్నారు. అలాగే, భద్రాద్రి జిల్లాలో 13,465 మంది అభ్యర్థుల కోసం 38 కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఇందులో కొత్తగూడెంలో 25, పాల్వంచలో 13 కేంద్రాలు ఉన్నాయి. కాగా, పరీక్షలు కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ప్రశాంతంగా జరిగేలా అధికారులు వారం రోజులుగా సమీక్షిస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణలో..

ఖమ్మం జిల్లాలో పరీక్షల పర్యవేక్షణకు ఇద్దరు రీజినల్ కోఆర్డినేటర్లను నియమించారు. ఇందులో విజయ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.చిన్నయ్య రీజినల్ కోఆర్డినేటర్–1గా 40 కేంద్రాలు, ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజ్‌కుమార్ రీజనల్ కోఆర్డినేటర్– 2గా 45 కేంద్రాలను పర్యవేక్షిస్తారు. అంతేకాక డీఆర్వో, ఆర్డీఓ నేతృత్వాన స్ట్రాంగ్ రూమ్ నుంచి ప్రశ్న పత్రాలను పరీక్ష కేంద్రాలకు చేరవేస్తారు. ఇందుకోసం ఎంపీడీఓలను జాయింట్ రూట్ అధికారులుగా, ప్రతీ 3–5 కేంద్రాల తనిఖీకి తహసీల్దార్లను ఫ్లైయింగ్ స్క్వాడ్‌గా నియమించారు. కాగా, పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రతీ అభ్యర్థికి ప్రత్యేకంగా ఓఎంఆర్ షీట్లు రూపొందించినందున సదరు అభ్యర్థి వచ్చినా, రాకున్నా వారి సీటు వద్ద ఓఎంఆర్ షీట్ పెడతారు. పరీక్ష సమయానికి ఐదు నిమిషాల ముందు ప్రశ్నాపత్రాలు అందించనున్నారు. ఇక ప్రతీ గదిలో కేవలం 24 మందికే సీటింగ్ కేటాయించి తాగునీరు, వైద్యశిబిరాలు ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నారు. అంతేకాక అభ్యర్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకునేందుకు రెండు రోజుల పాటు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపించనుంది.

రెండు సెషన్లలో పరీక్షలు..

షెడ్యూల్ ప్రకారం ఆది, సోమవారాల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12–30 గంటల వరకు, మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5–30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఉదయం సెషన్‌లో 8–30నుంచి, మధ్యాహ్నం సెషన్‌లో 1–30 గంటల నుంచి కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతిస్తారు. ఉదయం 9–30గంటలకు, మధ్యాహ్నం 2–30గంటలకు గేట్లు మూసివేసి ఆతర్వాత ఎవరిని కూడా లోనికి అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు.

లోక్ అదాలత్‌లో అంతిమ పరిష్కారం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్
- 16 బెంచ్‌ల ద్వారా 9,255 కేసుల పరిష్కారం



రాజీ పడిన వారికి అవార్డు, పూలమొక్క అందజేస్తున్న జిల్లా జడ్జి రాజగోపాల్

ఖమ్మం లీగల్: కక్షిదారులు లోక్ అదాలత్‌లో రాజీ పడిన కేసులపై అప్పీల్ ఉండదని.. తద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ వెల్లడించారు. ఖమ్మం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవాధికారి సంస్థ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 16 బెంచ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇరుపక్షాల కక్షిదారులు తమ న్యాయవాదులను సంప్రదించి కేసులు పరిష్కరించుకోవాలని, ఇందుకు పోలీసులు సహకరించాలని సూచించారు. ఇటీవల విడాకుల కేసులు పెరుగుతున్నాయని తెలిపారు. ప్రేమ వివాహాలతో పాటు పెద్దలు కుదిర్చిన వివాహాల్లోనూ భార్యాభర్తల నడుమ సమన్వయ లోపం, చిన్నపాటి మనస్పర్థలతో విడాకుల కోసం కోర్టులను ఆశ్రయిస్తున్నారన్నారు. అలా కాకుండా నేటి యువత సహనం, ఓర్పుతో కలిసిమెలిసి ఉండడానికి ప్రయత్నించాలని సూచించారు. మోటారు వాహనాల ప్రమాద బీమా కేసులను పరిష్కరించగా కక్షిదారులకు జిల్లా జడ్జి అవార్డు పంపిణీ చేయగా, శ్రీరామ్ ఇన్సూరెన్స్ కేసులో బాధిత కుటుంబానికి రూ.17 లక్షల పరిహారం మంజూరు చేశారు. డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, హరే రామ హరే కృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యాన కక్షిదారులకు తాగునీరు, భోజనం సమకూర్చారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు కె.ఉమాదేవి, వెంపటి అపర్ణ, అర్చనకుమారి, దేవినేని రాంప్రసాద్‌రావు, శ్రీనయ్య, చంద్రశేఖరరావు, ఎం.కల్పన, వి.శివరంజని, బెక్కం రజిని, ఏపూరి బిందుప్రియ, రాళ్లబండి శాంతిలత, వినుకొండ మాధవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు, ఇన్సూరెన్స్ కంపెనీల న్యాయవాదులు స్వర్ణ రాంబాబు, కొత్తపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు

9,255 కేసులు పరిష్కారం..

జిల్లాలోని కోర్టుల్లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌ద్వారా 9,255 కేసులు పరిష్కారమయ్యాయి. జిల్లా కోర్టుతోపాటు సత్తుపల్లి, మధిర కోర్టుల్లో ప్రత్యేక బెంచ్‌లు ఏర్పాటుచేశారు. మోటారు ప్రమాద కేసుల్లో సరైన రీతిలో నష్టపరిహారం అందించేందుకు బీమా కంపెనీలు అంగీకరించాయి. అత్యధికంగా ట్రాఫిక్ చలానా కేసులు 5,858 పరిష్కారమయ్యాయి. ఇక క్రిమినల్ కేసులు 647, సివిల్ కేసులు 40, చెక్ బౌన్స్ కేసులు 30, మోటారు ప్రమాద కేసులు 84, సైబర్ క్రైమ్ కేసులు 62, బ్యాంక్ రికవరీ కేసులు రెండు, ఎస్‌టీసీలు 1,790, వివాహ సంబంధ కేసులు 6తోపాటు మరో 736కేసులు పరిష్కరించారు.

జర్మనీ జంటను కలిపిన లోక్ అదాలత్

జర్మనీలో నివసిస్తున్న ఖమ్మంకు చెందిన భార్యాభర్తలను లోక్‌అదాలత్ కలిపింది. ఖమ్మంకు చెందిన హరికృష్ణ, స్వాతి జర్మనీలో ఉద్యోగరీత్యా ఉంటున్నారు. ఈక్రమాన స్వాతి గత ఏడాది మార్చి 11న ఖమ్మం మహిళా పోలీస్‌స్టేషన్‌లో భర్తపై ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. అయితే, శనివారం ఖమ్మం కోర్టులో జరిగిన లోక్ అదాలత్‌కు హాజరైన వారు తాము కలిసిపోవాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. దీంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ వారికి లోక్‌అదాలత్ అవార్డుతో పాటు పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

'భక్తరామదాసు' నీటి విడుదల

తిరుమలాయపాలెం: పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లోని చెరువులు నింపేందుకు గాను భక్త రామదాసు ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విడుదల చేశారు. కూసుమంచి మండలంలోని ఎర్రగడ్డ తండా వద్ద శనివారం భక్తరామదాసు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయగా సాయంత్రానికి తిరుమలాయపాలెం మండలంలోని ఇస్లావత్‌తండా వద్ద ఎస్సారెస్పీ కాల్వల్లోకి చేరింది. కాగా, అన్ని చెరువులు నిండే వరకు నీటి విడుదల కొనసాగుతుందని జల వనరుల శాఖ డీఈ బాణాల రమేష్‌రెడ్డి తెలిపా రు. అయితే, రైతులు నీటిని పొదుపుగా వాడుకోవా లని, కాల్వల తూముల వద్ద నీటి మళ్లింపునకు య త్నించొద్దని కోరారు. రబీ వరిసాగుతో పాటు ఇతర ఆరుతడి పంటల సాగు చేస్తున్న నేపథ్యాన నీరు విడుదల చేయడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.



ఇస్లావత్ తండా వద్ద ఎస్సారెస్పీ కాల్వలోకి చేరుతున్న జలాలు

మరిన్ని పరిశోధనలు అవసరం..

- కలెక్టర్, ఐటీడీఏ పీఓగా మంచి అధికారులు వచ్చారు
- వ్యవసాయ యూనివర్సిటీ వజ్రోత్సవ వేడుకల్లో మంత్రి తుమ్మల
- కలెక్టర్ పాటిల్ మునగ శాస్త్రవేత్త అంటూ కితాబు
- వ్యవసాయ కళాశాల ద్వారా రైతులకు అండగా నిలవాలని సూచన



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన భద్రాద్రి కలెక్టర్ పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్, ఎమ్మెల్యే జారె, హార్టికల్చరల్ యూనివర్సిటీ వీసీ రాజిరెడ్డి తదితరులు

అశ్వారావుపేట: వ్యవసాయ రంగంలో మరిన్ని పరిశోధనలు జరగాల్సిన అవసరముందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాలలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత కళాశాల ఆవరణలో సాగు చేస్తున్న మామిడి, ఇతర పంటలను పరిశీలించగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్ వివరాలు వెల్లడించారు. అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ మంచి అధికారులైన కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్ ఉన్నారని తెలిపారు. కలెక్టర్ వ్యవసాయ శాస్త్రవేత్త కావాలని కలలు కన్నప్పటికీ తప్పని పరిస్థితుల్లో కలెక్టర్ కావాల్సి వచ్చిందన్నారు. అయినప్పటికీ ఆయన మునగ సాగులో రైతులను ప్రోత్సహించేలా శాస్త్రవేత్తగా మారారని కితాబిచ్చారు. ఆయిల్‌పామ్‌లోనూ అంతరపంటగా మునగ సాగు చేయొచ్చని తెలిపారు. వ్యవసాయ కళాశాలను అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నందున ప్రతిపాదనలు పంపాలని మంత్రి సూచించారు.

స్థానికులకు ఉపయోగమేదీ?

అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల స్థానిక రైతాంగానికి ఉపయోగపడడం లేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఎన్టీఆర్ సీఎంగా, తాను మంత్రిగా ఉన్నపుడు ఏర్పాటైన వ్యవసాయ కళాశాల నుంచి గడిచిన 35ఏళ్లలో 2,500మంది పట్టభద్రులు బయటకు వచ్చారని, ఇక్కడ చదువుకున్న వారు ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందారని తెలిపారు. అశ్వారావుపేట కళాశాలకు ప్రపంచ స్థాయి గుర్తింపు వచ్చినా ఇక్కడి పరిశోధనలు, మేధా సంపత్తి స్థానిక రైతాంగానికి ఉపయోగపడడం లేదని చెప్పారు. ఇకనైనా రైతాంగానికి సాగులో మెళకువలు నేర్పితే ఫలితముంటుందని తెలిపారు. ఇక్కడ పండే పంటలతో ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు శాస్త్రవేత్తలు సూచనలు చేయాలన్నారు. తన వక్క తోటలో రాలి పడిన ఆకులను ఏరుకళ్లే వారు రూ.2చొప్పున చెల్లించి విస్తారాకులు తయారుచేసి అమ్ముకుంటారని తెలిపారు. ఇలా ప్రతీ పంటకు బై ప్రొడక్ట్స్ తయారు చేసేలా సూచనలు చేయాలని చెప్పారు. కలెక్టర్, ఎస్పీ ఉద్యోగాల కన్నా రైతు ఉద్యోగమే గొప్పదని, భవిష్యత్ మొత్తం రైతాంగానిదేనని ఆయన వెల్లడించారు. కరోనా సమయంలో ప్రపంచంలో చాలామంది తిండికి లేక అల్లాడినా రైతన్న నాగలి ఆపకుండా సాగు చేయడంతో అందరం కడుపునిండా తినగలిగామని తెలిపారు.

ఇంకా ఎవరేం అన్నారంటే...

■ ములకలపల్లి మండలంలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెరుగుతున్నందున రైతులు దూరం వెళ్లకుండా ములకలపల్లి మండలంలోనే పామాయిల్ ఫ్యాక్టరీ నెలకొల్పాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కోరారు. వ్యవసాయ కళాశాల విద్యార్థులు శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకుని నూతన విధానాలు, ఆధునిక వ్యవసాయాన్ని రూపొందించాలన్నారు. అలాగే, అశ్వారావుపేట నియోజకవర్గంలో వ్యవసాయ పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరిన ఎమ్మెల్యే చెట్ల ప్రాముఖ్యతను వివరిస్తూ పాటలు పాడారు.

■ రైతే నిజమైన రాజు అని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ వెల్లడించారు. రైతుల ఆర్థికాభివృద్ధికి తాను మునగ సాగును ప్రోత్సహిస్తున్నానని తెలిపారు. భూమాత నుంచి మనం పంటలు తీసుకునే క్రమంలో రసాయన ఎరువుల వాడకం ద్వారా నష్టం చేస్తున్నామని చెప్పారు. ఈమేరకు సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయంపై వ్యవసాయ కళాశాల విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు.

■ వ్యవసాయ రంగంపైనే మానవ మనుగడ ఆధారపడి ఉండగా... ఏటా సాగు విస్తీర్ణం తగ్గుతోందని భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ తెలిపారు. అశ్వారావుపేట ప్రాంతం ఆయిల్‌పామ్ సాగుకు కేంద్రంగా ఉన్నందున వ్యవసాయ రంగంలో వినూత్న ప్రయోగాల ద్వారా నూతన వంగడాల రూపకల్పన, సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి, హార్టికల్చరల్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ పి.రాజిరెడ్డి, ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్ రెడ్డి, డీఎస్పీ సతీష్‌కుమార్, ఐఓపీఆర్ చీఫ్ సైంటిస్టులు ఎంవీ.ప్రసాద్, కె.రామచంద్రుడు, మధిర ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త కె.రుక్మిణీదేవి, వైరా, కొత్తగూడెం కేవీకేల శాస్త్రవేత్తలు కె.రవి, లక్ష్మీనారాయణ, రైతులు ఆలపాటి రామచంద్రప్రసాద్, పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

15 ఎస్టీ ఆవాసాలకు త్రీఫేస్ విద్యుత్

ఖమ్మంవ్యవసాయం: ఎన్పీడీసీఎల్ ఖమ్మం సర్కిల్ పరిధిలో ఎస్టీఎస్డీఎఫ్ నిధుల ద్వారా ఇప్పటివరకు 15 ఎస్టీ ఆవాసాలకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా అందించామని ఎస్ఈ ఏ.సురేందర్ తెలిపారు. మారుమూల గిరిజన పల్లెలకు విద్యుత్ సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. విద్యుత్ అందించడం ద్వారా ఆయా ప్రాంతాల అభివృద్ధి సాధ్యమనే భావనతో విద్యుత్ శాఖ ఎస్టీ ఆవాసాలపై దృష్టి సారించిందని తెలిపారు. ప్రతీ పల్లెలో విద్యుత్ వెలుగులు నిండాలనే లక్ష్యంతో ప్రణాళికాయుతంగా పనులు చేపడుతున్నామని ఎస్ఈ వెల్లడించారు.

ఇంధన పొదుపు వారోత్సవాలు ప్రారంభం

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇంధన పొదుపు వారోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని టీజీ రెడ్కో సంస్థ మేనేజర్ కె.మనోహర్‌రెడ్డి ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈనెల 20వ తేదీ వరకు కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఇందులో భాగంగా పాఠశాలల్లో విద్యార్థులకు ఇంధన పొదుపుపై వ్యాసరచన పోటీలు నిర్వహించనుండగా, ప్రధాన కూడళ్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అంతేకాక ఇంధన పొదుపు ఆవశ్యకతను వివరించేలా ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నట్లు మేనేజర్ ఈ సందర్భంగా వెల్లడించారు.

క్లుప్తంగా

నేడు 'ఈస్తటిక్స్' పురస్కారాల సభ

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం ఈస్తటిక్స్ పురస్కారాల సభ ఆదివారం నిర్వహిస్తున్నట్లు సంస్థ బాధ్యులు పి.రవిమారుత్ తెలిపారు. 2024 సంవత్సరానికి గాను కవిత్వం, కథల పోటీల్లో విజేతలకు ఈ సభలో పురస్కారాలు అందించడమే కాక బహుమతులు పొందిన కథలతో రూపొందించిన సంకలనాన్ని ఆవిష్కరిస్తామని వెల్లడించారు. కవిత్వం విభాగంలో జూగంటి జగన్నాథం రచించిన కవితా సంపుటి 'ఒక కప్పు చాయ్ నాలుగు మెసేజ్‌లు' రూ.40 వేల బహుమతి గెలుచుకోగా, తెలుగు వెంకటేష్ రాసిన 'కబోజీ చేపల కబుర్లు', రాళ్లబండి శశిశ్రీ రాసిన 'అనుమంద్రం' కవితా సంపుటిలు ప్రత్యేక ప్రశంసా అవార్డులకు, విశిష్ట పురస్కార సంపుటిగా ఎస్.గోపి రాసిన 'క్రియ ఒక జీవన లయ' ఎంపికై ందని తెలిపారు. కథల విభాగంలో ఉత్తమ కథగా కేవీఎస్.ప్రీతమ్ రాసిన 'నూరేళ్ల మోసే తల్లికథ' రూ.25వేల బహుమతి గెలుచుకుందని వెల్లడించారు. రెండు, మూడు స్థానాల్లో సయ్యద్ గఫార్ రచించిన 'న్యూ బాబాయిజం' రూ.15 వేల బహుమతి, కరీం రాసిన 'ఝూజా' రూ.10వేల బహుమతికి ఎంపికయ్యాయని తెలిపారు. ఖమ్మం డీపీఆర్‌సీ హాల్‌లో ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు మొదలయ్యే అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో సాహితీప్రియులు పాల్గొనాలని రవిమారుత్ కోరారు.

పేదలకు మొండిచేయి చూపిస్తున్న ప్రభుత్వం

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్సీ తాతా మధు



చెక్కులు అందుకున్న వారితో ఎమ్మెల్సీ మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: అనారోగ్యం పాలై చికిత్సకు ఇబ్బంది పడుతున్న పేదలు సీఎంఆర్ ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకుంటే రాష్ట్రప్రభుత్వం మొండి చేయి చూపిస్తోందని ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ విమర్శించారు. ఖమ్మంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో రూ.24,16,500 విలువ గల 88 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణంతో కలిసి శనివారం ఆయన అందజేసి మాట్లాడారు. తమ ప్రభుత్వ హయాంలో రూ.5లక్షల వరకు కూడా సీఎంఆర్‌ఎఫ్ మంజూరు చేయగా, ఇప్పుడు రూ.60 వేలకు మించి ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పగడాల నాగరాజు, బెల్లం వేణుగోపాల్, ఉన్నం బ్రహ్మయ్య, పెంట్యాల పుల్లయ్య, వాచేపల్లి లక్ష్మారెడ్డి, భాషబోయిన వీరన్న, ముత్యాల వెంకటఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'సంక్షోభంలోకి వ్యవసాయ రంగం'

రఘునాథపాలెం: కేంద్ర, రాష్ట్ర పాలకులు రైతాంగాన్ని విస్మరించి పాలన సాగిస్తుండడంతో వ్యయసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోతోందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు ఆరోపించారు. మండలంలోని వి.వెంకటాయపాలెంలో రైతు సంఘం సభ్యత్వ నమోదును శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కేంద్రంలోని మోడీ సర్కార్ రైతాంగ ఉద్యమాలను అణిచివేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. అందులో భాగంగా ఆరు నెలలుగా దేశ రాజధాని సరిహద్దుల్లో రైతులు ఆందోళనలు చేస్తుంటే పట్టించుకోవడం లేదన్నారు. ఇక రుణమాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తప్పించుకునే రీతిలో వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈకార్యక్రమంలో నాయకులు శాఖమూరి శ్రీనివాసరావు, బాగం ప్రసాద్, రావెళ్ల సురేష్, బానోత్ రవి, తాళ్లూరి నాగ, రంగారావు, బానోత్ నర్సింహ, రావెళ్ల నాగభూషణం పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం, నలుగురు అరెస్ట్

సత్తుపల్లిటౌన్: చిన్న పొట్లాలుగా చేసి గంజాయి విక్రయిస్తుండడంతో పాటు సొంతానికి ఉపయోగిస్తున్న నలుగురిని సత్తుపల్లి పోలీసులు శుక్రవారం రాత్రి అరెస్ట్ చేశారు. కాగా, 111.29 గ్రాముల గంజాయితో నలుగురు పట్టుబడగా.. మరో ఇద్దరు పరారయ్యారు. ఈసందర్భంగా నిందితులను శనివారం కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. సత్తుపల్లిలోని వేంసూరురోడ్డులో ఉన్న కందిమళ్ల కృష్ణారావు మామిడి తోట వద్ద ఆరుగురు వ్యక్తులు రెండు మోటారు సైకిళ్లపై వచ్చి గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు శ్రీనాథ, జుంజునూరి సింహాద్రి పారిపోగా, ఆరుమళ్ల తరుణ్‌కుమార్, జగం అఖిల్, కలపాల రాంబాబు, షేక్ ఇబ్రహీం పట్టుబడ్డారు. వీరి నుంచి రెండు బైక్‌లు, రూ.2,782 విలువైన 111.29 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ టి.కిరణ్ తెలిపారు.

లైంగిక దాడి కేసులో అరెస్ట్

రఘునాథపాలెం: మండలంలోని పువ్వాడనగర్‌లో ఈనెల 9న రాత్రి ఒంటరి మహిళపై లైంగిక దాడి చేసిన జానీని శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు నిందితుడిని కోర్టులో హాజరుపర్చినట్లు రఘునాథపాలెం సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,413

మామిడి.. కష్టమేనా దిగుబడి?

- చెట్లకు అరకొరగానే కనిపిస్తున్న పూత
- పూత వచ్చినా ఆ వెంటనే చీడపీడలు
- అధికారులు అవగాహన కల్పించకపోతే రైతులకు నష్టమే..



పూత కనిపించని మామిడి తోట, (ఇన్‌సెట్) వచ్చిన పూత ఇలా మాడిపోతోంది

ఇల్లెందురూరల్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వేలాది ఎకరాల్లో రైతులు మామిడి తోటలు సాగు చేస్తున్నారు. ఫలరాజుగా గుర్తింపు పొందిన ఈ పంటలో కొన్ని సీజన్లుగా రైతులు ఆశించినట్లుగా కాత రావడం లేదు. ఏటా పూత దశలో వాతావరణం అనుకూలంగా లేకపోవడం, చీడపీడలు ఆశించడం వంటి కారణాలు రైతులను వేధిస్తున్నాయి. ఈ సీజన్‌లోనూ మామిడి రైతులకు అవే సమస్యలు పునరావృతమై ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రస్తుతం పూత రావడానికి, వచ్చిన పూత నిలబెట్టుకోవడానికి రైతులు పలు రూపాల్లో తీవ్రంగా శ్రమిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 57 వేల ఎకరాల్లో సాగు

ఉమ్మడి జిల్లాలో సుమారుగా 57 వేల ఎకరాల్లో మామిడితోటలు విస్తరించి ఉన్నాయి. భద్రాద్రి జిల్లాలో ఇల్లెందు, అన్నపురెడ్డిపల్లి, అశ్వారావుపేట, ములకలపల్లి, చంద్రుగొండ, పాల్వంచ, టేకులపల్లి, జూలూరుపాడు మండలాల్లో, ఖమ్మం జిల్లాలో సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల పరిధిలో అత్యధిక విస్తీర్ణంలో మామిడిని సాగు చేస్తున్నారు. ముఖ్యంగా బంగినపల్లి, దశేరీ, కేసరి, హిమాయత్, రాయల్ స్పెషల్, తోతాపూరి, చిన్నరసాలు, పెద్దరసాలు తదితర రకాలను సాగు చేస్తున్నారు.

కనిపించని పూత

కొన్నేళ్లుగా మామిడిలో నిర్దేశిత సమయం కన్నా ముందుగా లేదా ఆలస్యంగా పూత వస్తోంది. ఈ ప్రభావం మామిడి దిగుబడిపై తీవ్రంగా చూపుతోందని రైతులు వాపోతున్నారు. సాధారణంగా వాతావరణ పరిస్థితులు, మామిడి రకాలను బట్టి డిసెంబర్ నుంచి జనవరి వరకు మొగ్గలు వస్తాయి. కానీ, పస్తుతం డిసెంబర్ నెల సగం గడిచినా మామిడితోటల్లో పూత సరిగా కనిపించడం లేదు. పూసిన ఆ కాస్త పూత కూడా పక్షం రోజుల కిందట వచ్చిన తుపాన్ ప్రభావంతో చాలా వరకు రాలిపోయింది. ఉన్న కాసింత పూతకు చీడపీడలు ఆశించాయి. దీంతో అవి చెట్టుపైనే మాడిపోతున్నాయి. చీడపీడల నివారణకు పురుగుమందులను విపరీతంగా పిచికారీ చేస్తున్నా ఆశించిన ఫలితం ఉండటం లేదని రైతులు వాపోతున్నారు.

ఇప్పుడే అవగాహన కల్పిస్తే మేలు

సుదీర్ఘకాలం తరువాత భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉద్యాన పంటలకు గడ్డు పరిస్థితి ఏర్పడింది. గతంలో జిల్లాలో పనిచేసిన ఉద్యాన అధికారిని బదిలీ చేశారు. ఆయన స్థానంలో వచ్చిన అధికారి అనతికాలంలోనే అవినీతి నిరోధక శాఖకు పట్టుబడ్డాడు. దీంతో ఉద్యాన పంటలపై అధికారుల పర్యవేక్షణ తగ్గింది. ఇటీవల ఓ అధికారి బాధ్యతలు స్వీకరించినా ఉద్యాన పంటలపై దృష్టి సారించకపోవడం, ఆయిల్‌పామ్ సాగుపై మాత్రమే శ్రద్ధ పెట్టడం.. క్షేత్రస్థాయి సిబ్బంది అరకొరగా ఉండటం వంటి కారణాలతో ఉద్యాన పంటలపై తీవ్రంగా ప్రభావం చూపుతున్నాయి. అంతేకాకుండా ఏడాది కాలంగా జిల్లాలో కూరగాయల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గినా, ప్రస్తుతం మామిడికి పూత కనిపించపోయినా.. ఉద్యానశాఖ అధికారులలో చలనం లేకపోవడం రైతులకు శాపంగా పరిణమిస్తోందనే వాదనలు వినిపిస్తున్నాయి.

పూత దశలో మేలైన యాజమాన్యం

మామిడిలో పూత దశలో తీసుకునే సస్యరక్షణ చర్యలే ప్రధానం. ఈ దశలో చీడపీడలు ఆశించకుండా జాగ్రత్తలు తీసుకుంటే ఆశించిన దిగుబడిని రైతులు పొందగలుగుతారు. మామిడిలో పూతకు ముందు నుంచే పలురకాల చీడపీడలు ఆశిస్తాయి. వీటి నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై ఉద్యానశాఖ నిపుణుల సూచనలిలా ఉన్నాయి. తేనెమంచు పురుగు ఆకులు, కాడలు, పూత నుంచి రసాన్ని పీల్చేస్తాయి. గొంగళి పురుగు మొగ్గదశలో తన ప్రభావాన్ని చూపుతుంది. దీనికోసం పూమొగ్గ దశ నుంచే సస్యరక్షణ చర్యలు ప్రారంభించాలి. దీనికోసం లీటర్ నీటికి అర మిల్లీలీటర్ డైక్లోరోవాస్ లేదా 3 గ్రాముల కార్బరిల్‌ను కలిపి చెట్టులోపలి అన్ని భాగాలు తడిచేలా పిచికారీ చేయాలి. పచ్చి పూత, నల్లపూత దశల్లోనూ వీటి నివారణ చేపట్టాలి. బూడిత తెగులు, బూజు వేర్ల పోషకాలను పీల్చ టం వల్ల పూలు పిందెలు వడలిపోయి రాలిపోతాయి. బూడిద తెగులు నివారణకు మొగ్గ దశలో లీటరు నీటికి 3 గ్రాముల నీటిలో కరిగే గంధకాన్ని, పూత దశలో లీటరు నీటికి హెక్సాకోనజోల్ 2 మి.లీ లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ మందును కలిపి పిచికారీ చేయాలి. మంగును కలిగించే దీపపు పురుగుల నిరోధానికి ఎకరాకు 60 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్ లేదా 50 గ్రాముల థయోమిథాక్సిమ్, 200 గ్రాముల కార్బండిజంను కలిపి పిచికారీ చేయాలి. మామిడి చెట్లను నిరంతరం గమనిస్తూ ఏవైనా అసహజ లక్షణాలుంటే నిపుణులతో నిర్ధారించుకొని తగిన యాజమాన్యం చేపడితే మంచి కాత వస్తుంది.

చీడపీడలతో ఆందోళన



ఏటా మామిడిలో వస్తున్న చీడపీడలు నష్టాల బారిన పడేస్తున్నాయి. ఈసారి కూడా డిసెంబర్ సగానికి చేరినా పూత కనిపించడం లేదు. ఉన్న కొద్దిపాటి పూత కూడా మాడిపోతోంది. ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం ఉండటం లేదు. జాగ్రత్తలు సూచించే అధికారుల జాడ కనిపించడం లేదు. –మంచె కృష్ణయ్య, రైతు, కొమరారం, ఇల్లెందు మండలం

విద్య, వైద్యానికే ప్రభుత్వ ప్రాధాన్యత

టీఎస్ యూటీఎఫ్ జిల్లా మహాసభల్లో మంత్రి తుమ్మల



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన ఎమ్మెల్సీ నర్సిరెడ్డి తదితరులు

సత్తుపల్లి: రాష్ట్రప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట వేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. అందులో భాగంగా 11వేల మంది టీచర్ పోస్టులను ఇటీవల భర్తీ చేశామని తెలిపారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఆరో మహాసభలు సత్తుపల్లి ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో శనివారం ప్రారంభం కాగా ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రాష్ట్రంలో 30వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు కల్పించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా మార్చి తర్వాత అన్ని సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఇదే సమయాన పాఠశాలల అభివృద్ధి, గ్రామీణ విద్యార్థులకు మెరుగైన విద్య అందించేలా ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయాలని సూచించారు. తొలుత జవహర్‌నగర్‌లో టీఎస్ టీయూఎఫ్ ప్రాంతీయ కార్యాలయ నూతన భవనాన్ని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ప్రారంభించగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి, జిల్లా అధ్యక్షుడు జి.నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గాభవానితో పాటు బండి నర్సింహారావు, డి.రాజు, పి.నాగేశ్వరరావు, రాజశేఖర్, జియావుద్దీన్, వీరబాబు, చెరుకు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడు ఎన్టీఆర్



వేడుకల్లో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకల్లో మంత్రి తుమ్మల

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం అర్బన్: తెలుగు ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోయే మహోన్నత వ్యక్తి నందమూరి తారకరామారావు అని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఎన్టీఆర్ అభిమానుల ఆధ్వర్యాన ఖమ్మం లకారం ట్యాంక్‌బండ్‌పై ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని మేయర్ పి.నీరజ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించగా.. ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి తుమ్మల తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సినీ, రాజకీయ రంగాల్లో విశేష సేవలందించి తెలుగువారి కీర్తిని ప్రపంచ పటంలో నిలిపిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. ఆతర్వాత ఎన్టీఆర్ నటించిన చిత్రాల్లోని సన్నివేశాలు, పాటలను ప్రదర్శించారు. కార్పొరేటర్లు రావూరి కరుణ, కమర్తపు మురళి, మిక్కిలినేని మంజుల నరేందర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో పాటు బాలసాని లక్ష్మీనారాయణ, పొట్ల నాగేశ్వరరావు, మానుకొండ రాధాకిషోర్, తుమ్మల యుగంధర్, రావూరి సైదుబాబు, నల్లమల ఆనంద్, సండ్ర రాంబాబు, ఆళ్ల అంజిరెడ్డి, నాళం సతీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో పార్టీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పించాక కేక్ కట్ చేశారు. పార్టీ నాయకులు వాసిరెడ్డి రామనాథం, కేతినేని హరీష్‌చంద్రతో పాటు బాలసాని లక్ష్మీనారాయణ, మల్లాది హన్మంతరావు, మంద వెంకటనారాయణ, ఓర్స్ కృష్ణ, తలపనేని జయరాం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



కొణిజర్ల : గురుకులంలో భోజనం చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

కొణిజర్ల: రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటూ జీవితంలో రాణించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కొణిజర్ల మండలం తనికెళ్లలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల గురుకుల డిగ్రీ కళాశాలలో శనివారం ఆయన కామన్ మెనూ అమలును ప్రారంభించి మాట్లాడారు. ఆతర్వాత బాలికలు, వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.శ్రీవాణి, వైస్ ప్రిన్సిపాల్ ఎం.నవ్య, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కే.పీ.ఐశ్వర్య, సీజీసీ కోఆర్డినేటర్ బి.రాజేశ్వరి, ఏటీ కె.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదేళ్ల తర్వాత కుటుంబం చెంతకు..



రమణను కుటుంబీకులకు అప్పగిస్తున్న శ్రీనివాసరావు

ఖమ్మంఅర్బన్: మతిస్థిమితం కోల్పోయిన మహిళకు చికిత్స చేయించి ఆమె కోలుకున్నాక కుటుంబీకులకు అప్పగించిన వైనమిది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం అమ్మపాలెం బంజరకు చెందిన తురక రమణ మతిస్థిమితం కోల్పోయిన పరిస్థితుల్లో తొమ్మిదేళ్ల క్రితం ఖమ్మంలో తిరుగుతుండగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు అన్నం ఫౌండేషన్‌లో చేర్పించారు. ఇన్నాళ్లు ఆమెకు వైద్యం అందిస్తుండగా ఇటీవల కోలుకోవడంతో వివరాలు ఆరా తీస్తే కుటుంబ వివరాలు వెల్లడించింది. ఆమె తల్లిదండ్రులది ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం కావడంతో వారికి సమాచారం ఇవ్వగా తల్లి, కుటుంబీకులు శనివారం ఫౌండేషన్‌కు వచ్చి బిడ్డను గుండెలకు హత్తుకున్నారు. కాగా, 20ఏళ్ల క్రితం అమ్మపాలెం బంజరకు చెందిన వ్యక్తితో రమణకు వివాహం కాగా ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చింది. పెళ్లయిన ఐదేళ్లకు మతిస్థిమితం కోల్పోవడంతో అప్పటి నుంచి తల్లి వద్దే ఉంటున్న ఆమె తొమ్మిదేళ్ల క్రితం తప్పిపోగా ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. చివరకు అన్నం ఫౌండేషన్ బాధ్యులు శనివారం ఆమెను తల్లి, సోదరికి అప్పగించగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న టీపీటీఎఫ్ నాయకులు

ఖమ్మంసహకారనగర్: విద్యాశాఖలోని సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా టీపీటీఎఫ్ నాయకులు శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద దీక్ష శిబిరంలో రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు పద్మ, విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ అయిన పే స్కేల్ అమలుతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. ఆతర్వాత పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వై.వీ.రావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమానికి సహకరిస్తామని చెప్పారు. ఎస్ఎస్ఏ ఉద్యోగుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఝాన్సీసౌజన్య, జిల్లా అధ్యక్షుడు షేక్ మహబూబ్ పాషా మాట్లాడగా టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఏ.వీ.నాగేశ్వరరావుతో పాటు వివిధ సంఘాల నాయకులు హుస్సేన్, రత్నకుమార్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టైర్లు ఊడడంతో పల్టీ కొట్టిన కంప్రెషర్

నేలకొండపల్లి: క్వారీలో డ్రిల్లింగ్ చేసే కంప్రెషర్ ప్రమాదవశాత్తు పల్టీ కొట్టగా డ్రైవర్ అందులో చిక్కుకుపోయాడు. దీంతో స్థానికులు గమనించి ఆయనను బయటకు తీశారు. మండలంలోని ఓ గ్రానైట్ క్వారీలో పనిచేసే డ్రిల్లింగ్ కంప్రెషర్‌ను మరమ్మతుకు కోసం శనివారం నేలకొండపల్లికి తీసుకెళ్లి వస్తున్నారు. ఈక్రమాన భైరవునిపల్లి క్రాస్ వద్ద కంప్రెషర్ అదుపు తప్పి ముందు టైర్లు ఊడిపోయాయి. ఆపై వాహనం చెట్టును ఢీకొని బోల్తా పడింది. డ్రైవర్ బాబు వాహనం కింద చిక్కుకుపోవడంతో అటుగా వస్తున్న వరి కోత మిషన్ డ్రైవర్ స్థానికుల సాయంతో ఆయనను బయటకుతీశారు. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడగా, జేసీబీ సాయంతో కంప్రెషర్‌ను నిలబెట్టారు.

కేఎంసీ జేసీబీపై దాడి, డ్రైవర్లకు గాయాలు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన జేసీబీపై పలువురు దాడికి పాల్పడిన ఘటన శనివారం చోటు చేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... చైతన్యనగర్ సమీపాన బైపాస్ రోడ్డు పక్కన స్మశానవాటిక, రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేపట్టినట్లు కేఎంసీ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో టౌన్ ప్లానింగ్ అధికారులు జేసీబీతో వెళ్లి నిర్మాణాన్ని తొలగించి వెనుదిరిగారు. ఈక్రమంలో ఆక్రమ నిర్మాణదారులు ఎన్టీఆర్ సర్కిల్ వద్ద రాళ్లతో జేసీబీపై దాడి చేయగా అద్దాలు పగలడంతో పాటు ఇద్దరు డ్రైవర్లకు గాయాలయ్యాయి. అనంతరం జేసీబీని ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లగా అక్కడ సైతం మరోమారు దాడి చేయడంతో పేరెల్లి ప్రవీణ్, రవి తదితరులపై అధికారులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు. కాగా, అక్రమ నిర్మాణాన్ని తొలగించి వస్తుండగా ఓసారి, పోలీసుస్టేషన్ వద్ద మరోసారి కేఎంసీ వాహనంపై దాడి జరగడంతో తాము విధులు ఎలా నిర్వర్తించాలని సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. దీంతో కేఎంసీ కమిషనర్ అభిషేక్ సీపీ సునీల్‌దత్‌తో మాట్లాడి నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు సమాచారం. కాగా, నిందితుల పరారీలో ఉన్నట్లు తెలిసింది.

సైబర్ మోసంపై కేసు నమోదు

చింతకాని: మండల కేంద్రానికి చెందిన చెన్నూరి నాగాచారి ఇచ్చిన ఫిర్యాదుతో శనివారం సైబర్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు. నాగాచారి ఫోన్‌లో ఫేస్‌బుక్ చూస్తుండగా రుణ ప్రకటన రావడంతో ఆయన క్లిక్ చేశాడు. ఆతర్వాత విడతల వారీగా రూ.29,700 నగదు ఖాతా నుంచి విత్‌డ్రా అయింది. దీంతో సైబర్ నేరగాళ్ల బారిన పడ్డట్లు గుర్తించిన నాగాచారి పోలీసులను ఆశ్రయించాడు.

ప్రేమించిన యువతి దక్కదనే మనస్తాపంతో ఆత్మహత్య



వెంకటేష్ (ఫైల్)

రఘునాథపాలెం: ప్రేమను పెద్దలు ఒప్పుకోకపోగా యువతికి మరో వ్యక్తితో వివాహం జరిపించేలా యత్నిస్తున్నారనే మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపిన వివరాలు... మండలంలోని కోటపాడుకు చెందిన జోనబోయిన వెంకటేష్(25), సమీప గ్రామానికి చెందిన యువతి చదువుకునే సమయం నుంచి ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరు ప్రస్తుతం ఒకే కంపెనీలో ఉద్యోగాలు చేస్తున్నట్లు తెలిసింది. అయితే, వీరి ప్రేమను యువతి తల్లిదండ్రులు వ్యతిరేకించడమే కాక ఆమెకు మరో వ్యక్తితో వివాహం చేసేందుకు యత్నిస్తున్నట్లు సమాచారం. ఈ విషయం తెలిసిన వెంకటేష్ గత గురువారం పురుగుల మందు తాగగా కుటుంబీకులు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఘటనపై శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఉరి వేసుకుని వివాహిత...

ముదిగొండ: మండలంలోని బాణాపురానికి చెందిన వివాహిత శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెందిన వివాహిత వడ్డేపూడి నాగమల్లేశ్వరి(20) ఇంట్లో ఎవరూ లేని సమయాన ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుంది. అయితే, ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

అప్పుల బాధతో రైతు..



భూపతిరావు (ఫైల్)

రఘునాథపాలెం: మండలంలోని కోటపాడుకు చెందిన రైతు గునిపిన్ని భూపతిరావు (30) వ్యవసాయంలో నష్టం రావడంతో అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్య చేసుకున్నాడు. భూపతిరావు తన పొలానికి తోడు కోయచెలకలో కౌలుకు తీసుకున్న మూడెకరాల్లో మిర్చిసాగు చేయగా వైరస్‌తో ఎండిపోయింది. పంట పెట్టుబడికి చేసిన అప్పులే కాక ట్రాక్టర్ కొనుగోలు, ఇంటి నిర్మాణానికి చేసిన అప్పులు రూ.లక్షల్లో ఉండడంతో తీర్చే మార్గం కానరాక పొలం వద్దకు శనివారం వెళ్లి పురుగుల మందు తాగాడు. ఆతర్వాత విషయాన్ని భార్యకు ఫోన్‌లో చెప్పగా ఆయనను ఆస్పత్రికి తరలించే క్రమంలోనే మృతి చెందాడు. ఘటనపై భూపతిరావు తండ్రి వెంకయ్య ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని వెంకటగిరి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహబూబాబాద్‌లోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన సల్లగట్టు హరిబాబు(46) చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొన్నాళ్ల క్రితం భార్య నుంచి విడిపోయిన ఆయన మరోమహిళతో హుజూర్‌నగర్‌లో ఉంటున్నాడు. ఈనెల 11న జమాండ్లపల్లిలోని బంధువుల ఇంట్లో వేడుకకు స్నేహితులతో కలిసి ఆటోలో వచ్చిన ఆయన రాత్రి బయలుదేరాడు. మార్గమధ్యలో వెంకటగిరి వద్ద ప్రమాదంలో గాయపడిన హరిబాబుకు చికిత్స చేయిస్తుండగా శుక్రవారం రాత్రి మృతి చెందాడు. అయితే, హరిబాబు మృతిపై అనుమానం ఉందని ఆయన భార్య శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఖమ్మం రూరల్ సీఐ ముష్క రాజు తెలిపారు.